క్లుప్తంగా

రసాయనాల వినియోగం తగ్గించాలి

సోన్: రసాయనాలను తగ్గించి.. జీవన ఎరువుల వినియోగం పెంచాలని ఏఈవో అంబాజీ అన్నారు. గురువారం మండలంలోని కుచన్‌పల్లిలో జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో మాట్లాడుతూ భూమిలో భాస్వరం కరిగించేందుకు జీవన ఎరువులు వాడాలన్నారు. అనంతరం నూతన పాసుపుస్తకం పొందిన రైతులు రైతుబీమా కోసం వ్యవసాయాధికారుల దగ్గర వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ ఇందూరి రాజు,రైతు కోఆర్డినేటర్ శివారెడ్డి, కార్యదర్శి ప్రియాంక, లింగన్న తదితరులున్నారు.

మిత్రుడి కుటుంబానికి అండ



నగదు అందిస్తున్న స్నేహితులు

కుంటాల: మండల కేంద్రానికి చెందిన గంధం రమణ తల్లి గంగవ్వ అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం రమణతో కలిసి 2004–05లో పదో తరగతి చదివిన అతడి మిత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.20,100 నగదును వారికి అందించి స్నేహభావం చాటుకున్నారు. పూర్వవిద్యార్థులు విజయ్, ప్రణయ్‌రావు, శివకుమార్, గుమ్ముల దినేశ్, ఓ.ప్రశాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

పఠన నైపుణ్యాలు పెంచాలి

మామడ: విద్యార్థుల్లో ప్రాథమిక దశ నుంచే పఠన నైపుణ్యాలను పెంపొందించాలని ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని పరిమండల్ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం సందర్శించి మాట్లాడారు. గ్రంథాలయం పీరియడ్‌ను నిర్వహించాలని సూచించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, ప్రమోద్‌రాం, గంగన్న, పద్మజ, ఆశాకిరణ్ ఉన్నారు.

ఘనంగా బోనాల పండుగ



బోనాలతో వెళ్తున్న మహిళలు

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి)గ్రామంలో గురువారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆడెల్లి పోచమ్మ ఆలయానికి కాలినడకన వెళ్లి నైవేద్యం సమర్పించారు.

లక్ష్మణచాంద వాసికి డాక్టరేట్




ఆడెపు రాజేశ్వర్

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన ఆడెపు రాజేశ్వర్ రాజనీతి శాస్త్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. లక్ష్మణచాందకు చెందిన ఆడెపు లింగన్న–చిన్నమ్మ దంపతుల కుమారుడు రాజేశ్వర్ యూజీసీ మాజీ సభ్యులు, విశ్రాంత ఆచార్యులు గోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో స్థానిక సంస్థల్లో మహిళల భాగస్వామ్యం, సాధికారిత అంశాలపై గ్రంథం సమర్పించారు.ఈయన తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో సహ ఆచార్యులుగా పని చేస్తున్నారు.

కుభీర్ మార్కెట్ చైర్మన్‌ను నియమించరెందుకు?

కుభీర్: కుభీర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవీ ఎస్సీ వర్గానికి రిజర్వు అయినందున చైర్మన్‌ను నియమించకుండా కాలయాపన చేస్తున్నారని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన దళిత నాయకులు పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పాత చైర్మన్ పదవీకాలం ముగిసి ఆరు నెలలు గడుస్తుందని.. భైంసా మార్కెట్‌కు చైర్మన్‌ను నియమించి కుభీర్‌కు నియమించకపోవడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సింగారం లక్ష్మణ్, వెన్నెల సతీశ్, జి.దిగంబర్, గౌతమ్, నారాయణ, గంగాధర్, ఉదయ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు అందిస్తున్న నారాయణ్‌రెడ్డి

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ధర్మోరలో హరిత హారం మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంద శారద, శ్రీనివాస్, స్వామిగౌడ్, రమేశ్‌గౌడ్, ఆజోబ పటేల్, దేవిదాస్, రియాజొద్దీన్ తదితరులు ఉన్నారు.

ఛిద్రమవుతున్న రోడ్లు

- కేజీవీల్స్ ట్రాక్టర్లతో దెబ్బతింటున్న రహదారులు
- కంకర తేలి, పగుళ్లు ఏర్పడుతున్న వైనం
- రూ.కోట్లలో ప్రజాధనం వృథా
- రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



ట్రాలీలో కేజీవీల్స్ ట్రాక్టర్‌ను పొలానికి తీసుకెళ్తున్న రైతు



లోకేశ్వరంలో రోడ్డుపై వెళ్తున్న కేజీవీల్స్ ట్రాక్టర్

లోకేశ్వరం: రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చించి మారుమూల గ్రామాలకు సైతం తారు, సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. కానీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రెండేళ్లు కూడా గడవక ముందే సదరు రోడ్లు నరకదారులుగా మారుతున్నాయి. దీనంతటికీ ప్రధాన కారణం కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లు యథేచ్ఛగా రోడ్లపై తిరగడమే. ముఖ్యంగా పంటల సాగు సమయంలో వానాకాలం, యాసంగి కాలంలో గ్రామాల్లో కేజీవీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్లపై నడిపిస్తుండటతో రహదారులు కొన్ని నెలలకే ధ్వంసమవుతున్నాయి.

ధ్వంసమవుతున్న రోడ్లు...

మండలంలో లోకేశ్వరం–దేగాం, లోకేశ్వరం–నందిపేట్, నిర్మల్–భైంసా జాతీయ రహదారితోపాటు డబుల్ రోడ్లు, లింక్ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం సుమారు రూ.వంద కోట్లు మంజూరు చేసింది. కొన్ని మార్గాల్లో పనులు పూర్తవగా.. మరికొన్ని మార్గాల్లో పనులు జరుగుతున్నాయి.

ఈ రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు విచ్చలవిడిగా తిరుగుతుండడంతో పగుళ్లు ఏర్పడి దెబ్బతింటున్నాయి. కొన్ని మార్గాల్లో రోడ్లు ధ్వంసమై కంకర తేలడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

15 ఏళ్లపాటు మన్నికగా ఉండాల్సిన రోడ్లు.. కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లు నడపడంతో ఒకటి, రెండేళ్లలోనే ధ్వంసమై గుంతలు పడి దెబ్బతింటున్నాయి. పగుళ్లు, గీతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ, పీఆర్, పోలీసులు, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్లు దెబ్బతినకుండా ట్రాలీ ద్వారా కేజీవీల్స్ ట్రాక్టర్లను పొలం వద్దకు తీసుకెళ్లి దున్నుకోవాలని పేర్కొంటున్నారు.

రోడ్లపై నడపొద్దు



నిర్మల్‌టౌన్: జిల్లాలో రోడ్లపై కేజీవీల్స్ టాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సీహెచ్. ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం పల్లెలు, పట్టణాల్లో నాణ్యమైన రోడ్లను వేశారన్నారు. కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లు నడిపితే ఏళ్లపాటు ఉండాల్సిన రోడ్లు నెలల్లోనే దెబ్బతింటున్నాయని తెలిపారు. దీంతో ప్రజాధనం వృథా అవుతుందని.. ప్రజలు ముఖ్యంగా రైతులు గమనించాలని కోరారు.

ట్రాక్టర్లను సీజ్ చేస్తాం



కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లను తారురోడ్లపై నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. యజమానులకు జరిమానా విధించడంతోపాటు ట్రాక్టర్‌ను సీజ్ చేస్తాం. రహదారి భద్రతకు అందరూ సహరించాలి. రోడ్లపై నేరుగా కాక ట్రాలీ ద్వారా కేజీవీల్స్ ట్రాక్టర్‌ను పొలం వద్దకు తీసుకెళ్లి దున్నుకోవాలి.

– సరిత, లోకేశ్వరం తహసీల్దార్

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



దహనం చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్



నిర్మల్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



భైంసాలో దహనం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

ఖానాపూర్: 24 గంటల ఉచిత విద్యుత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి.. రైతులకు క్షమాపణ చెప్పాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో ఎమ్మెల్యే మాట్లాడారు. పుప్పాల శంకర్, వెంకాగౌడ్, రాజేందర్, ఖలీల్, రాజగంగన్న, కిషోర్, గజేందర్, కేహెచ్‌ఖాన్, రాజేశ్వర్, రవితేజ, మల్లయ్య తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, సర్పంచ్ రాంరెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీటీసీ మల్లేశ్, రమేశ్, గంగారెడ్డి, సాగర్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ దత్తాద్రి, సర్పంచ్‌లు మల్లేశ్, ప్రదీప్‌కుమార్, నాయకులు దిగంబర్, సదాశివ్‌పటేల్, పురుషోత్తం, గజేందర్, లక్ష్మణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట గురువారం బీఆర్ఎస్ నాయకులు నిరసనకు దిగారు. పార్టీ మండలాధ్యక్షుడు భూమారెడ్డి పీఏసీఎస్ వైస్ చైర్మన్ చాకెటి లస్మన్న, హంపోలి సర్పంచ్ ప్రసాద్, నాయకులు శ్రీనివాస్, గణేశ్, గోపి, కిషన్ పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద గురువారం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు విఠల్‌రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. రాజేశ్‌బాబు, జేకే పటేల్, తోట రాము, ఆసిఫ్, తదితరులున్నారు.

మామడ: మండల కేంద్రంతోపాటు కొరిటికల్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. చంద్రశేఖర్‌గౌడ్, నల్ల లింగారెడ్డి, రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి వివేకానంద చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జాగృతి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ చారి, కౌన్సిలర్లు సైండ్ల ఉమశ్రీధర్, కత్తి నరేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, శ్రీనివాస్, హజ్ కమిటీ సభ్యులు ఎండీ నజిరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, గంగారాం పాల్గొన్నారు.

సోన్: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ సమీపంలో బీఆర్ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మొహినొద్దీన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



ముథోల్‌లో మాట్లాడుతున్న డీఎల్పీవో శివప్రసాద్



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న వైద్యాధికారి



మామడలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

ముథోల్: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎల్పీవో శివప్రసాద్ అన్నారు. ముథోల్ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో అమీర్‌ఖాన్, ఆకాష్, సీడీపీవో శ్రీమతి, మనుమోహన్ శాస్త్రీ, కార్యదర్శులు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

భైంసారూరల్: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మహాగాం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. గురువారం భైంసా మండల పరిషత్ కార్యాలయంలో వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి, ఎంపీవో మోజంహుస్సేన్ పాల్గొన్నారు.

మామడ: వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, వైద్యసిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని రైతువేదికలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కామేశ్వర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సిబ్బంది పర్యటిస్తూ పీహెచ్‌సీకి నివేదికలు పంపాలని సూచించారు. ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్, ఆరోగ్యవిస్తరణాధికారి వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

సారంగపూర్: మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి సీజనల్ వ్యాధులపై ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అవగాహన కల్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైద్యసిబ్బంది, కార్యదర్శులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి శైలజ మాట్లాడుతూ తాజా ఆహారం, కాచి చల్లార్చిన నీరు తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో సోలమాన్ రాజ్, సిబ్బంది ఉన్నారు.

లక్ష్మణచాంద: మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు వైద్యాధికారి శ్రీకాంత్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, వైద్యురాలు ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులపై జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఎంపీవో ఖలీల్ హైమద్, ఏపీవో మంజులారెడ్డి, సమత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుభీర్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వాటర్ ట్యాంకులను, మురుగు కాల్వలను శుభ్రం చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో లింబాద్రి, డాక్టర్ ప్రణయ్, పీహెచ్ఎన్ చంద్రకళ, సూపర్‌వైజర్లు సాయిబాబు, శ్రీనివాస్, ఏఎన్ఎంలు, కార్యదర్శులు ఉన్నారు.

ఈరోజు

మహాలక్ష్మి పండుగ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఖానాపూర్ మహాలక్ష్మి ఆలయ ఉత్సవాలు శుక్రవారం వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శ్రీ శివభక్త మార్కండేయ ఈశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించేందుకు వెళ్లనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు తెలిపారు.

మంత్రి పర్యటన

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌లో శుక్రవారం మంత్రి ఐకేరెడ్డి పర్యటించనున్నారు. ఉదయం నల్ల భీంరెడ్డి, రాంరెడ్డి విగ్రహాలను ఆవిష్కరిస్తారని డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి తెలిపారు. నర్సాపూర్(జి)లో శుక్రవారం మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు పోడు పట్టాలు పంపిణీ చేస్తారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు.

అమ్మవారికి అభిషేకం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం నందు లలితా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ గురుస్వామిమూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలి రావాలని కోరారు.

బాబా ఆలయంలో పూజలు



నిర్మల్‌లో పూజలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాతలుగా నిలిచిన స్వప్న–రాజశేఖర్, మంజుల–బ్రహ్మయ్య చారి దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, సాయిదీక్ష సేవా సమితి సభ్యులు నందు, జిందం గోవర్ధన్, సోమేశ్, భూషణ్, చౌదరి, ఆమెడ శ్రీధర్, నరాల రేణుకదాస్ పాల్గొన్నారు.

కల్లూర్‌లో..

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం గోపూజ, బాబాకు అభిషేకం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి

ఖానాపూర్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను సీఎం మనుమడే బహిరంగం చేశాడంటే.. విద్యారంగంలో రాష్ట్రం ఎంత వెనుకబడి ఉందో తెలిసిపోతుందన్నారు. కార్యక్రమంలో శృతి, ఉదయ్, కునాల్, శివాజీ, రాజేశ్, రాజు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో రిటైర్డ్ ఐఏఎస్ పర్యటన



సామగ్రి పంపిణీ చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ శర్వన్

ఖానాపూర్: మండలంలోని బీర్నంది, ఎర్వచింతల్, కోలాంగూడ పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శర్మన్ నాయక్ పర్యటించారు. గ్రామాల్లో యువకులకు వాలీబాల్, క్రికెట్ కిట్‌లను అందించారు. అనంతరం రంగపేట(కొత్తగూడెం)కు చెందిన చుక్క శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి రూ.మూడు వేల ఆర్థికసాయం అందించారు. సర్పంచ్ గోపాల్, చిలుకూరి మురళి, భూమారెడ్డి, ఇమ్రాన్ ఉన్నారు.

పంచాయతీ కార్మికుల నిరసన



లక్ష్మణచాందలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఖానాపూర్: పట్టణంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన దీక్ష గురువారం ఎనిమిదో రోజుకు చేరింది. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు చేస్తామని ఆ సంఘం మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ హెచ్చరించారు. నాగరాజు, స్వామి, పోశెట్టి, తదితరులు ఉన్నారు.

ముథోల్: మండల కేంద్రంలో చేపట్టిన పంచాయతీ కార్మికుల సమ్మెకు గురువారం బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. అధికారులు తమపై ఒత్తిడి తీసుకురావొద్దని వారు పేర్కొన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు పోతన్న, రమేశ్, జీవన్, యోగేశ్, బంటి భూషణ్, బాలాజీ తదితరులున్నారు.

లక్ష్మణచాంద: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మండలంలోని పంచాయతీ కార్మికులు నిరసన చేపట్టారు. ఉద్యోగ భద్రత, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపిక

నర్సాపూర్(జి):మండలంలోని అంజనీతండా గ్రామానికి చెందిన రాథోడ్ శోభాబాయి–శ్రీనివాస్ దంపతుల కుమార్తె రాథోడ్‌సింధు ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి ఎంపికైంది. గురువారం విడుదల చేసిన రెండో విడత జాబితాలో ఎంపికైంది. ఈమె పదో తరగతి సోషల్ వెల్ఫేర్ బాసరలో చదివి 9.8 జీపీఏ సాధించింది.

రాష్ట్ర కమిటీ సమావేశం జయప్రదం చేయాలి

నిర్మల్‌టౌన్: ఈనెల 14న హైదరాబాద్‌లోని నాగోల్‌లో నిర్వహించే గౌడ జన హక్కుల రాష్ట్ర కమిటీ సమావేశంలో గౌడ కులస్తులందరూ పాల్గొనాలని కమిటీ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాలకు నూతన ఇన్‌చార్జులను నియమించడతోపాటు గీత కార్మికుల సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు.

ఉచిత విద్యుత్ ఇచ్చిందే కాంగ్రెస్

కుంటాల: రైతులకు ఉచిత విద్యుత్తును ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించడం సరికాదని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ ఆలూర్ ప్రశాంత్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కల్లూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాంనాథ్, రాకేశ్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సులువుగా అర్థమయ్యేలా బోధన

సోన్: మండల కేంద్రంలోని న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలలో గురువారం భారతదేశం భౌగోళిక స్వరూపాలు అనే పాఠ్యాంశంపై సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుడు, గైడ్ కుర్ర శేఖర్ పదో తరగతి విద్యార్థులకు పటం ద్వారా క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసమూర్తి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పశువులకు అడ్డాగా రోడ్లు



జిల్లా కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై పశువులు సంచరిస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు పశువులు వాహనాల మీదకు వస్తుండటంతో వాహనదారులు కిందపడి గాయాల పాలవుతున్నారు. మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్లపైకి పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

చెక్కు అందజేత

భైంసారూరల్: మండలంలోని కుంసరకు చెందిన పద్మిని బాయికి రూ.లక్ష విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. గురువారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దేగాంలోని తన నివాసంలో బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందించారు. సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.